ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

మంగళవారం 25, జూలై 2023

# పోచంపల్లి సుదర్శన రావు పుస్తకాలు అవిష్కరణ

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూలై 25:** ప్రముఖ రచయిత పోచంపల్లి సుదర్శనరావు నిన్నటి తరానికి రేపటి జనానికీ వారధిలాంటి ప్రయోజనాత్మకమైన రచనలు చేశారని, ఎనభై ఏళ్ళ వయసులోనూ తన సాహితీ సేద్యాన్ని కొనసాగిస్తున్న సుదర్శన్ రావు అభినందనీయులని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకట రమణ అన్నారు. ప్రముఖ రచయిత పోచంపల్లి సుదర్శన రావు రచించిన 'అనఘా సహస్రము, సుదర్శన శతక చక్రము, సుదర్శన శతక మంజరి' పుస్తకాల ఆవిష్కరణ సభ బాల సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో హెూటల్ డైమండ్ నేవీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొక్కాపు వెంకటరమణ పాల్గొనిపుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదర్శన్ రచించిన పుస్తకాలు అందరికీ ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవాచకులు రచయిత్రి డా టికె చూడామణి



సభకు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జనార్థన్ ప్రముఖ కార్టూనిస్టు శ్రీధర్, శాస్త్రీయ సంగీత గాయనీమణులు డా సరోజ, డా. సుజాత, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ప్రభంజన్ రావు పాల్గొన్నారు. కాగా..సభకు ముందు రమేష్ ప్రదర్శించిన బంజారా మిమిక్రీ అందరినీ అలరించింది.



హైకోర్టు సంచలన తీర్పు.. ఎమ్మెల్యే వనమాపై అనర్హత వేటు..

2



ఈ సారి కొత్త నియోజకవర్గానికి గులాబీ పెద్ద బాసు.. పోటీ అక్కడనుంచేనా..?

2



మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు హైకోర్టులో ఎదురు దెబ్బ....

2

# తొమ్మిది నెలల్లో మూసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి రూ.52 కోట్లతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం

## ముంపు సమస్యకు పర్మినెంట్ సెల్యూషన్ - ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



మూసారాంబాగ్ బ్రిడ్జ్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూలై 25:** మంత్రి కేటీఆర్ నేతృత్వంలో నాలాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా పనులు వేగవంతం చేశామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. వచ్చే వానాకాలం నాటికి పనులు పూర్తిచేసి ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కారం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు . గత వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇయ్యాల మంగళ వారం పలు శాఖల అధికారులు కార్పొరేటర్ ఇ.విజయకుమార్ గౌడ్ తో కలిసి మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద ఆయన పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరవ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీతో పాటు మొత్తం అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. భారీగా వస్తున్న మూసీ వరద తో చిన్నగా ఉన్న మూసారాంబాగ్ తరచూ మునిగిపోతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం కోసం మంత్రి కేటీఆర్ రూ.53 కోట్ల వ్యయంతో మూసారాంబాబు బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న రహదాలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తాము ముందస్తు చేపట్టిన పనులతో ముంపు సమస్య తప్పిందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నాలాల ప్రక్షాళనలతో పాటు పాటు వరద నీటి పైప్ లైన్ల ప్రక్షాళన పనులు చేపట్టడంతో నియోజకవర్గ వ్యాప్తంగా గత ఎన్నడూ లేని విధంగా గరిష్ట వర్షపాతం నమోదవుతున్నా వరదనీరు సజావుగా వెళ్లేందుకు తీసుకుంటున్న చర్యలతో ఎలాంటి ఆస్తి నష్టం ప్రాణం నష్టం జరగలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శరత్ కుమార్, సీఐ కిషన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రత్నానగర్ నాలా రిటర్నింగ్ వాల్... నిర్వాసితులకు రూ.1.20 కోట్ల చెక్కులు అందజేత

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:** నల్లకుంట డివిజన్ రత్నా నగర్ వద్ద వరద నీటి నుండి రక్షణగా ఏర్పాటు చేస్తున్న రిటర్నింగ్ వాల్ నిర్మాణం కారణంగా ఇండ్లను కోల్పోతున్న 12 మంది భూ నిర్వాసుతులకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ. 1 కోటి 21 లక్షల రూపాయల నష్ట పరిహారం చెక్కులను ఇయ్యాల శివానంద్ నగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ లోకల్ కార్పొరేటర్ వై. అమృత తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దశాబ్దాల కాలంగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సమస్యలను అధు నాతన విధానాలలో పరిష్కరిస్తున్నారని అన్నారు. నల్లకుంట రత్నా నగర్ వద్ద రిటర్నింగ్ వాల్ పనులు పూర్తి చేసి వరద నీరు ఇండ్లలోకి వరద నీరు చేరే ప్రమాదాన్ని శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.



నల్లకుంటలో రత్నానగర్ నిర్వాసితులకు పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు



## తెలంగాణకు ఖ్యాతి తెచ్చిన స్విమ్మర్ క్వీని విక్టోరియా..

### సన్మానించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ , ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూలై 25:** ఇటీవల ఈజిప్ట్ రాజధాని కైరోలో జరిగిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించిన అంబర్ పేట నియోజకవర్గం బర్కత్ పురకు చెందిన గంధం క్విని విక్టోరియాను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సన్మానించి, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి దగ్గరకు ప్రత్యేకంగా తీసుకువెళ్లి పరిచయం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ క్విని విక్టోరియాను తెలంగాణాకు రోల్ మోడల్ గా నిలిచిందని అభినందించి, శాలువాతో సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి ప్రోత్సహిస్తోందని, క్విని విక్టోరియాకు ప్రభుత్వం తరపున తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:**

మూసారాం బాగ్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్, గౌతం రావ్, నాయకులు శ్యామ్ రాజ్, డివిజన్ అధ్యక్షులు దాసోజు నాగభూషణం, రవీందర్ గౌడ్ యశ్వంత్, కృష్ణ ముదిరాజ్, భాస్కర్ గౌడ్ , తిరుపతి గుప్తా, నరసింహగౌడ్, జంగయ్య ,హరి తదితరులు



## వామ్మో...హైదరాబాద్‌లో మళ్లీ మొదలైన వాన..

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:** హైదరాబాద్ వాసులతో పాటు ముఖ్యంగా అంబర్ పేట ప్రజలకు బిగ్ అలర్ట్ ..నగరంలో మళ్లీ వాన మొదలుకావడం..అది కూడా ఆఫీస్‌ల నుండి వచ్చే సమయంలో వర్షం వస్తుండడంతో అంత భయపడుతున్నారు. నిన్న కూడా ఇదే సమయంలో వర్షం పడి నగరాన్ని అతలాకుతలం చేసింది. ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో సోమవారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట సేపు పడిన వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. గచ్చిబౌలి, ఐకియా, సైబర్ టవర్స్ మాదాపూర్ సహా నగర వ్యాప్తంగా రోడ్లు, ఫ్లై ఓవర్లపై ఎక్కడికక్కడ ట్రాఫిక్ జాం అయ్యింది. ఆఫీసులు, విద్యాసంస్థల నుంచి ఇంటికి వెళ్లే వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే ఉండిపోయి ఎటూ కదలలేక నరకయాతన అనుభవించారు. ఐటీ కారిడార్ లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారడం, వాహనాలు ముందుకు కదల్లేని స్థితికి చేరాయి. చాలామంది అర్ధరాత్రి సమయానికి ఇంటికి చేరుకున్నారు. కాగా.. నిన్న సోమవారం రాత్రి 10 గంటల వరకు రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలో 6.48 సెం.మీ, చార్మినార్ 6.33 సెం.మీ. గోల్కొండ 5.85 సెం.మీ., అంబర్‌పేట 5.75 సెం.మీ., బహదూర్‌పుర 5.65 సెం.మీ. శేరిలింగంపల్లి 5.43 సెం.మీ. ఖైరతాబాద్ 5.1 సెం.మీ, షేక్‌పేట 4.9 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. అలాగే పలు చెరువులు మత్తడి పోస్తుండడం తో పలు ప్రాంతాల్లో



భారీగా నీరు వచ్చి చేరింది. నగరంలో చాల కాలనీలు ఇంకా నీటిలో ఉండగా..ఇక ఇప్పుడు మరోసారి వర్షం పడుతుండడంతో నగరవాసులు ఖంగారు పడుతున్నారు. మరోపక్క సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగర పరిధిలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కీలక సూచనలు చేశారు. రేపు ఐటీ ఉద్యోగులు మూడు విడుతల్లో లాగౌట్ చేయాలని సూచించారు. ఐకియా - సైబర్ టవర్స్ వరకు ఐటీ ఆఫీసుల్లో మధ్యాహ్నం 3 గంటలకు లాగౌట్ చేయాలని, ఐకియా-బయోడైవర్సిటీ వరకు ఐటీఆఫీసుల్లో సాయంత్రం 4.30 గంటలకు లాగౌట్ చేయాలని సూచించారు. ఐకియా - రాయదుర్గం వరకు ఐటీ ఆఫీ సుల్లో సాయంత్రం 4.30 గంటలకు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఐటీ ఆఫీసుల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య లాగౌట్ చేయాలని కోరారు. గచ్చిబౌలి ఐటీ ఆఫీసుల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య లాగౌట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:**

మూసారాం బ్రిడ్జ్ వద్ద తాజా వరద పరిస్థితిని పరిశీలిస్తున్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:**

గోల్నాక వరద ప్రభావిత ప్రాంతాలైన దుర్గానగర్, అన్నపూర్ణ నగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ కలియతిరిగారు. అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. భారీ వర్ష సూచనతో ప్రజలు అప్రమత్తంగా ఉంటాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తినా తమకు తెలియజేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అధికారులు మరియు నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:**

మూసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు చేపడతారని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇయ్యాల మూసారాంబాగ్ బ్రిడ్జ్ వద్ద పరిస్థిని కాంగ్రెస్ నాయకులు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, పీసీసీ సెక్రెటరీ శంబుల శ్రీకాంత్ గౌడ్ పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు షేక్ జమీర్, రవి కుమార్, జహంగీర్ , శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:**

గోల్నాక డివిజన్ లక్ష్మీ నగర్‌కు చెందిన టేకుమల్ల సురేందర్ అలియాస్ డప్పు సునీల్ అకాల మరణ పొందగా ఇయ్యాల ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 25:**

గోల్నాక వడ్డర బస్తీకి చెందిన బీఆర్ ఎస్ నాయకురాలు బోధస్సు యాదమ్మ చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
జనరల్ న్యూస్
మంగళవారం 25, జూలై 2023


## తెలంగాణపై అమిత్ షా ఫుల్ ఫోకస్..

### అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రత్యేకంగా 22 కమిటీలు



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 25:** తెలంగాణపై బీజేపీ ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో బీజేపీ దూకుడు పెంచింది. తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలని శత విధాలా ప్రయత్నిస్తోంది. తెలంగాణ వ్యవహారాలను నేరుగా అమిత్ షా పర్యవేక్షించనున్నారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో పోల్ వార్ రూం ఏర్పాటు రంగం సిద్ధం చేశారు. పోల్ వార్ రూం ఇంచార్జ్‌గా బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాంని నియమించారు.ప్రజలకు దగ్గరయ్యేందుకు మీడియా స్ట్రాటజీ టీం ఏర్పాటు చేసింది. మీడియా స్ట్రాటజీ టీం ఇంచార్జ్ గా జాతీయ నేత శ్వేతను నియామకం అయ్యారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, యోగానందకు సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించారు. సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి, చింతలకు సమన్వయ బాధ్యతలు ఇచ్చారు.అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రత్యేకంగా 22 కమిటీలు వేశారు. ప్రతి రోజూ బీజేపీ కార్యాలయంలో ఒక జాతీయ కార్యవర్గ సభ్యుడి ప్రెస్ మీట్ నిర్వహించాలని నిర్ణయించారు. జులై 29న తెలంగాణాకు అమిత్ షా రానున్నారు. ఆ లోపు అన్ని వ్యవహారాలు చక్కబెట్టేలా కార్యాచరణ రూపొందించారు.

# బీజేపీపై అవిశ్వాస తీర్మానానికి విపక్షాల కసరత్తు!

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 25:** బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు తమ అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. మణిపూర్? హింస వ్యవహారంపై పార్లమెంట్? ఇప్పటికే అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో విపక్షాల కూటమి




'ఇండియా'.. మరో కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లో ఎన్?డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని విపక్ష ఎంపీలు భావిస్తున్నట్టు సమాచారం. ఇయ్యాల మంగళవారం ఉదయం.. ఉభయ సభల కార్యకలాపాలు మొదలయ్యే ముందు ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి నిరసనలు చేయాలి? అన్న విషయంపై వారు చర్చించుకున్నట్టు సమాచారం. మణిపూర్?లో మహిళలపై అఘాయిత్యానికి సంబంధించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్? వేదికగా స్టేట్?మెంట్? ఇచ్చేంత వరకు నిరసనలు కొనసాగించాలని వారందరు నిశ్చయించుకున్నట్టు తెలుస్తోంది. ఇదే భేటీలో అవిశ్వాస తీర్మానం కూడా తెరపైకి వచ్చినట్టు, అందుకు విపక్ష నేతలందరు అంగీకరించినట్టు తృణమూల్? కాంగ్రెస్? సభ్యులు తెలిపారు.

#### ఉభయ సభల్లో వాయిదాల పర్వం..!

మరోవైపు విపక్షాల ఆందోళనల మధ్య ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశమైన లోక్?సభ.. కొద్దిసేపటికే మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. విపక్ష నేతలు నినాదాలు ఆపేయాలని స్పీకర్? ఓం బిర్లా కోరడం.. వారు అందుకు అంగీకరించకపోవడం, సభ వాయిదా పడటం.. అంతా చకచకా జరిగిపోయాయి.
ఇక రాజ్యసభది కూడా ఇదే పరిస్థితి! ఉదయం 11 గంటలకు మొదలైన సభ కార్యకలాపాలు 10 నిమిషాల్లోనే.. 12 గంటలకు వాయిదా పడ్డాయి. ఇంతలో విపక్షాల నిరసనలపై స్పందించారు పీయుష్ గోయల్."మహిళలపై నేరాలు జరిగితే చర్చించాల్సిందే. రాజస్థాన్?, ఛత్తీస్?గఢ్?లో మహిళలు, పిల్లలపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించిన 177 నోటీసులపై చర్చకు ప్రభుత్వం సిద్ధం," అని పీయుష్? గోయల్? అన్నారు. కాంగ్రెస్? పాలిత రాష్ట్రాల పేర్లు చెప్పిన ఆయన బీజేపీ పాలిత మణిపూర్? పేరు మాత్రం ప్రస్తావించలేదు.

## ఈ నెల 30న బహిరంగ సభ..

### టీ కాంగ్రెస్ మహిళ డిక్లరేషన్‌లో ఏ అంశాలు ఉండబోతున్నాయి..?

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 25:** కర్ణాటక ఎన్నికల తర్వాత జోష్ మీద ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఈ నెల 30వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ప్రియాంక గాంధీతో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ప్లాన్ చేసింది కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే రాహుల్ గాంధీ వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ ప్రకటించారు. ప్రియాంక గాంధీ ఇబ్రహీంపట్నం సభలో యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. అయితే ఇప్పుడు ప్రియాంక గాంధీ కొల్లాపూర్ సభలో మహిళ డిక్లరేషన్ ప్రకటించ బోతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



అయితే కాంగ్రెస్ మహిళ డిక్లరేషన్‌లో ఎలాంటి అంశాలు ఉంటాయి అనే అంశంపై ఇప్పుడు ఆసక్తిగా చర్చ నడుస్తుంది. కర్ణాటక తరహాలో మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం హామీ ఉంటుందని కాంగ్రెస్ వర్గాల నుండి తెలుస్తుంది. అంతే కాకుండా మరో 4 కీలకమైన హామీలు ఉండబోతున్నాయనీ తెలుస్తుంది. మరి కాంగ్రెస్ ఎలాంటి హామీలను తెలంగాణ మహిళలకు ఇస్తారు అనేది చూడాలి.

## గ్రూప్ 1 ప్రిలిమ్స్..

### సోమవారం వరకు ఫలితాలు ప్రకటించవద్దు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 25:**
తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఫలితాలపై హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. 2023 జూలై 31 సోమవారం వరకు ఫలితాలు ప్రకటించవద్దొని టీఎస్ పీఎస్సీని ఆదేశించింది, ప్రిలిమ్స్ ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిటిషన్ పై విచారణ చేపట్టిన ధర్మాసనం... కౌంటర్ దాఖలు చేయాలని టీఎస్‌పీఎస్సీకి సూచించింది. వాదనలు వినిపించేందుకు సోమవారం వరకు టీఎస్ పీఎస్సీ సమయం కోరగా అప్పటివరకు ఫలితాలు ఇవ్వొద్దని కోర్టు




సూచించింది. కాగా 2023 జూన్ 11న గ్రూప్-1 ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 2.33 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## హైకోర్టు సంచలన తీర్పు..

### ఎమ్మెల్యే వనమాపై అనర్హత వేటు..


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 25:**
తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై అనర్హత వేటు వేసింది. ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదని స్పష్టంచేసింది. దీంతోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యేగా జలగం వెంకట్రావ్‌ను ప్రకటించింది. ఎన్నికలవేళ తప్పుడు అఫిడవిట్ సమర్పించి నట్లు నిర్ధారించిన.. ధర్మాసనం రూ.5లక్షలు జరిమానా విధించింది. అయితే, ఎన్నికలప్పుడు అఫిడవిట్‌లో సమర్పించిన కేసులు, ఆస్తులు అబద్దాలని తేల్చింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన వనమా..ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పట్లో బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన జలగం వెంకట్రావు.. వనమా అఫిడవిట్‌పై కోర్టులో పిటీషన్



దాఖలు చేశారు. జలగం వెంకట్రావు పిటిషన్ ను విచారించిన హైకోర్టు.. ఈసీకి తప్పుడు సమాచారం ఇచ్చిన వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని.. తీర్పునిచ్చింది.వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేకు అనర్హుడని.. 2018 డిసెంబర్ 12 నుంచి సమీప అభ్యర్థి జలగం వెంకట్రావు ను ఎమ్మెల్యే గా గుర్తించాలని తెలంగాణ ధర్మాసనం తీర్పులో వెలువరించింది. వనమా వెంకటేశ్వరరావు తన భార్య పేరు ఉన్న ఆస్తులను ప్రకటించకపోవడంతో జలగం వెంకట్రావు కోర్టు ఆశ్రయించారు. ఎన్నికల అఫిడవిట్ తో పాటు సమర్పించాల్సిన ఫామ్ 26 కు సంబందించిన వివరాలను వనమా సమర్పించలేదు. భార్య పేరు మీద ఉన్న ఆస్తులు అఫిడవిట్లో ఉన్న వనమా మెన్షన్ చెయ్యలేదు. కాగా.. వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయగా.. బీఆర్ఎస్ నుంచి జలగం వెంకట్రావు పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు.

# ఐదో కక్ష్యలోకి చంద్రయాన్ 3.. సక్సెస్‌ఫుల్ చేసిన ఇస్రో

**ఇయ్యాల్టి న్యూస్, శ్రీహరి కోట, జూలై 25:** చంద్రునిపై అడుగు పెట్టేందుకు సమయం మరింత దగ్గర పడింది. ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్ 3 మరో అడుగు ముందుకేసింది. ఇటీవలే నాలుగో కక్ష్యలో భూమి చుట్టూ తిరిగి వ్యోమనౌక.. ఇప్పుడు ఐదో కక్ష్యలోకి అడుగుపెట్టిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వెల్లడించింది. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ నుంచి ఈ విన్యాసాన్ని చేపట్టగా.. తదుపరి కక్ష్యలోకి విజయవంతంగా ఫైరింగ్ నిర్వహించినట్లు ప్రకటించింది.వ్యోమనౌక భూమి చుట్టూ తిరిగే ప్రక్రియలో చంద్రయాన్ 3కి సంబంధించి ఇది చివరి కక్ష్య కావడం చెప్పుకోదగిన విషయం. ఈ కక్ష్య తర్వాత వ్యోమనౌక చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. అయితే ఈ విన్యాసాన్ని ఆగస్టు 1 చేపట్టనున్నట్టు ఇప్పటికే ఇస్రో వెల్లడించింది.




జూలై 14న ఎల్వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా విజయవంతంగా భూకక్ష్యలో ప్రవేశపెట్టిన ఇస్రో.. మరుసటిరోజు కక్ష్యను పెంచడం మొదలుపెట్టారు. ఇలా పలు దశల వారిగా.. ఇప్పటివరకు ఐదు సార్లు కక్ష్యలను పెంచి.. చంద్రయాన్ 3ని చంద్రుని వద్దకు చేరుస్తున్నారు. అంటే ఈ కక్ష్య పూర్తయిన తర్వాత వ్యోమనౌక చంద్రుడి కక్ష్యలోకి వెళ్తుందన్నమాట. అంతా అనుకున్నట్టుగా జరిగితే.. ఆగస్టు 23న సాయంత్రం ఇది జాబిల్లిపై ల్యాండర్ ల్యాండ్ అవుతుంది.

## ఈ సారి కొత్త నియోజకవర్గానికి గులాబీ

# పెద్ద బాసు.. పోటీ అక్కడనుంచేనా..?

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 25:** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. డిసెంబర్ నాటికి ఎన్నికలు జరగనుండటంతో ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ సన్నాహాలను ప్రారంభించాయి. ఈ క్రమంలో రాష్ట్ర రాజకీయాల్లో వచ్చే ఎన్నికల కంటే సీఎం కేసీఆర్ ఎక్కడ పోటీ చేస్తారని విషయమే ఆసక్తిగా మారింది. ప్రజలందరికీ ఇది ఆసక్తి కలిగించే అంశం అయితే కొద్దిమందికి మాత్రం ఆందోళన కలిగించే వ్యవహారం. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసినా.. గెలిచిన నేత ఒక్క కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాత్రమే అని చెప్పొచ్చు. వరుసగా సిద్ధిపేటలో ఓటమి ఎరగని నేతగా ఉన్న కేసీఆర్.. ఉద్యమ భావ వ్యాప్తి కోసం కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత మహబూబ్ నగర్ ఎంపీగా పోటీ చేసి గెలిచి దక్షిణ తెలంగాణలో ఉద్యమాన్ని బలోపేతం చేశారు. మెదక్ ఎంపీగా కూడా గెలుపొందిన కేసీఆర్ ఎమ్మెల్యేగా గజ్వేల్ నియోజకవర్గంలోనూ గెలుపొందారు. వరుసగా రెండోసారి గజ్వేల్ నుంచి విజయకేతనం ఎగరవేశారు.ఇన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసి.. విజయాలను ఖాతాలో వేసుకున్న కేసీఆర్ ఈసారి మళ్లీ తన సీటు తానే మార్చుకుంటారని ప్రచారం జరుగుతుంది. గజ్వేల్ వదిలి మేడ్చల్ లో పోటీ చేస్తారని కొంతమంది, లేదు యాదాద్రి ఆలయం ఉన్న ఆలేరు నియోజకవర్గంలో పోటీ చేస్తారని మరికొంతమంది.. ఇలా ఎన్నో రకాలుగా పార్టీలో చర్చ జరుగుతుంది. ఇక ఇవన్నీ కాదు పెద్దపల్లి నియోజకవర్గాన్ని ఈసారి పెద్ద సార్ ఎంచుకున్నారని టాక్ ఈ మధ్యకాలంలో మొదలైంది. ఇదంతా కాదు కామారెడ్డి




నియోజకవర్గంలో ఇప్పటికే సర్వే మొదలైంది.. కేసీఆర్ అక్కడి నుంచే బరిలో ఉంటారనేది మరో వర్గం వాదన.ఇలా సీఎం కేసీఆర్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారని విషయంలో భారత రాష్ట్ర సమితితో పాటు ఇతర పార్టీలో కూడా చర్చ జరుగుతుంది. ఇదంతా ఒక ఎత్తైతే సార్ పోటీ చేస్తే ఎక్కడ మా సీటు గల్లంతవుతుందోనని సిట్టింగ్ ఎమ్మెల్యేలు టెన్షన్ పడుతున్నారని సమాచారం.. ఏదిఏమైనప్పటికీ దీనిపై క్లారిటీ రావాలంటే గులాబీ దళపతి కే చంద్రశేఖర్ రావు స్పష్టత ఇవ్వాల్సిందే..

## చైనాతో సంబంధాలు..

# అజిత్ దోవల్ కీలక వ్యాఖ్యలు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** పక్కలో బల్లెంలా ఉన్న పొరుగు దేశం చైనాతో భారతదేశం సంబంధాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2020లో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి చోటుచేసుకొన్న పరిణామాల కారణంగా భారత్-చైనా మధ్య వ్యూహాత్మక, ప్రజా, రాజకీయ సంబంధాలు దారుణంగా దెబ్బతిన్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య విశ్వాసం కనుమరుగైందని అన్నారు.దక్షిణాఫ్రికాలోని జొహెన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న బ్రిక్స్ సమావేశానికి వచ్చిన అజిత్ దోవల్.. చైనా అత్యున్నత దౌత్యవేత్త వాంగ్ యీతో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఇరుదేశాల మధ్య ఇబ్బందికర పరిస్థితులను తొలగించేందుకు నిరంతరం చర్యలు చేపట్టాలని అజిత్ దోవల్ సూచించారు. సరిహద్దు సమస్యపై చర్చించేందుకు ప్రత్యేక ప్రతినిధులుగా చైనా తరపున వాంగ్ యీ, భారత్ తరపున అజిత్ దోవల్ వ్యవహరిస్తున్నారు.చైనా ప్రతినిధి వాంగ్‌యీ మాట్లాడుతూ.. ఇరు దేశాలు పరస్పరం వ్యూహాత్మక విశ్వాసాన్ని పెంచుకుని.. సహకారంపై దృష్టి పెట్టి అడ్డంకులను దాటాలని పిలుపునిచ్చారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను పూర్వ స్థితికి



తీసుకురావాలని ఆకాంక్షించారు. చైనా ఎప్పుడూ ఆధిపత్య ధోరణి ప్రదర్శించబోదని.. భారత్ సహా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఇక సైబర్ భద్రతపై సమష్టిగా కలిసి పనిచేయాలని మిత్రదేశాలకు బ్రిక్స్ సమావేశంలో అజిత్ దోవల్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు

# హైకోర్టులో ఎదురు దెబ్బ....

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 25:**
తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కు హైకోర్టులో చుక్కెదురయింది. తన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్ ను కొట్టివేయాలంటూ ఆయన చేసిన అభ్యర్థనను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్ లో తప్పుడు పత్రాలను సమర్పించారంటూ శ్రీనివాస్ గౌడ్ కు వ్యతిరేకంగా మహబూబ్ నగర్ కు చెందిన రాఘవేంద్రరాజు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను కొట్టివేయాలంటూ హైకోర్టును శ్రీనివాస్ గౌడ్ ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు శ్రీనివాస్ గౌడ్ పిటిషన్ ను కొట్టివేసింది. రాఘవేంద్రరావు పిటిషన్‌ను మాత్రం స్వీకరించిం

## ఓటరకు కిలో మటన్ పంచిన...
## అయినా ఓడిపోయినా : నితిన్ గడ్కరీ

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 25:** గతంలో తాను ఓ ఎన్నికల్లో మటన్ పంచినప్పటికీ ఓడిపోయానని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాగపూర్ లో మహారాష్ట్ర స్టేట్ టీచర్స్ కౌన్సిల్ (ఎంఎస్‌టీసీ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటర్లు చాలా తెలివైనవారని, ఎవరికి ఓటు వేయాలో వారికి కచ్చితంగా తెలుసునని అన్నారు. రాజకీయ నాయకులు ప్రజల నమ్మకాన్ని, ప్రేమను సంపాదిస్తే చాలన్నారు. అప్పుడు డబ్బులు పంచడం, తాయిలాలు ఇవ్వడం, బ్యానర్లు, పోస్టర్లు వేయడం కోసం ఖర్చు చేసే అవసరం ఉండదన్నారు.



ఇదే సందర్భంలో తాను ఎదుర్కొన్న అనుభవాన్ని వెల్లడించారు. గతంలో తాను ఒక్కో ఓటరుకు ఒక కిలో మటన్ పంపిణీ చేసిన తర్వాత కూడా ఎన్నికల్లో ఓడిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఓటర్లు చాలా తెలివైనవారని, ప్రతి అభ్యర్థి నుండి వారు ఎన్నికల సమయంలో వచ్చే డబ్బులు, ఇతరాలను స్వీకరిస్తారని, కానీ చివరకు తమకు సరైన లేదా నచ్చిన అభ్యర్థికే ఓటు వేస్తారని అన్నారు.

## రూ. 5వేల లంచం తీసుకుని..
# ఆ కరెన్సీ నోట్లను మింగేశాడు...



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** మధ్యప్రదేశ్‌లోని కట్నిలో రెవెన్యూశాఖ అధికారి రూ.5వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అయితే లోకాయుక్త స్పెషల్ పోలీసులు అతన్ని వల వేసి పట్టుకున్నారు. పట్వారి గజేంద్ర సింగ్ . తన ప్రైవేటు ఆఫీసులో ఓ వ్యక్తి నుంచి రూ.5వేలు తీసుకున్నాడు. దాంట్లో రూ.500 నోట్లు ఉన్నాయి. అయితే పోలీసుల్ని చూడగానే ఆ పట్వారి తన వద్ద ఉన్న కరెన్సీ నోట్లను నమిలి మింగేశాడు. పట్వారి గజేంద్ర లంచం తీసుకున్నట్లు ఎస్పీ సంజయ్ సాహూ తెలిపారు. బార్కేడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమకు పట్వారి గురించి ఫిర్యాదు చేశాడని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం గజేంద్ర ఆస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అతను క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విమానయాన రంగంలో కొత్త శకం..
# ప్రపంచంలో యాడికైనా రెండు గంటల లోపే..!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** విమానయాన రంగంలో సబ్ ఆర్బిటల్ ఫ్లైట్ శకం ప్రారంభం కానుందని బ్రిటీష్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ఓ పరిశోధాత్మక కథనాన్ని ప్రచురించింది. 2033 కల్లా ప్రపంచంలోని ఏ ప్రదేశానికైనా కేవలం రెండు గంటల్లోనే చేరుకునే స్థాయిలో అత్యాధునిక విమానసేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. ఇందులో భాగంగా రాకెట్లను పోలిన విమానాల ద్వారా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతారట. నిటారుగా గాల్లోకి ఎగిరే ఈ విమానాలు ఆకాశంలో సుమారు 125 మైళ్ల ఎత్తువరకు వెళ్లి.. మళ్లీ వేగంగా భూమ్మీద తమ గమ్యస్థానాలవైపు దిగుతాయి. ఈ క్రమంలో 3 వేల మైళ్లకు మించి గరిష్ఠ వేగాలను అందుకుంటూ ప్రయాణ సమయాన్ని అనూహ్య రీతిలో తగ్గించేస్తాయని వెల్లడించింది. ఇప్పటికే జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్, రిచర్డ్ బ్రాన్సన్‌కు చెందిన వర్జిన్ గాలెక్టిక్ సంస్థలు ప్రయాణికులకు సబ్ ఆర్బిట్ ఫ్లైట్ ప్రయాణాన్ని పరిచయం చేశాయి. ఇక అత్యంత వేగవంతమైన 'కాంకార్డ్' విమానం కనుమరుగై దాదాపు 20 ఏళ్లు కావస్తోంది. అప్పట్లో ఆ విమానం ఓ సంచలనం. ప్రపంచపు తొలి సూపర్ సానిక్ ఫ్లైట్‌గా చరిత్రకెక్కిన ఈ విమానం 2000లో జరిగిన ఓ ప్రమాదంతో తెరమరుగైపోయింది. అయితే, నాసా ప్రస్తుతం మరో సూపర్ సానిక్ విమానంపై ప్రయోగాలు చేస్తోంది.




ఎక్స్-59 పేరుగల ఈ విమానాన్ని త్వరలో నాసా ప్రయోగాత్మకంగా పరీక్షించనుంది. కాంకార్డ్ కంటే నెమ్మదైనప్పటికీ ఈ విమానంతో న్యూయార్క్-లండన్ ప్రయాణ సమయాన్ని ఏకంగా 3.30 గంటల మేర తగ్గించొచ్చట. దీని గరిష్ఠ వేగం గంటకు 1500 కిలోమీటర్లు కాగా, కాంకర్డ్ అప్పట్లో ఏకంగా గంటకు 2000 కిలోమీటర్ల పైచిలుకు వేగాన్ని అందుకుంది. ఎక్స్-59 విమానంలో 'క్వైట్ సూపర్ సానిక్ టెక్నాలజీ'ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో, ధ్వనివేగాన్ని అధిగమించే సమయంలో వినిపించే సానిక్ బూమ్(భారీ ధ్వని) తీవ్రత చాలా వరకూ తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక సింగిల్ సీటు ఉన్న ఎక్స్-59 విమానం పొడవు కేవలం 100 అడుగులు మాత్రమే ఉంటుందట. గాల్లో 55 వేల అడుగుల ఎత్తులో ప్రయాణించగలిగే ఈ విమానం గరిష్ఠంగా మాక్ 1.4 వేగాన్ని( ధ్వనికి 1.4 రెట్ల వేగం) అందుకోగలదు.



# ఇంత ఘోరమా...
### అన్న శవాన్ని బైక్ మీద కట్టి ... స్వగ్రామానికి తరలించిన తమ్ముడు..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:**
మహారాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోంది. గ్రామాలు, నగరాల్లోని ఆసుపత్రుల్లో రోగుల కోసం అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నాయని పేర్కొంటున్నాయి. అయితే తాజాగా అక్కడ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రశ్నించే విధంగా ఒక వాదన తెరపైకి వచ్చింది. గడ్చిరోలి జిల్లా ఆసుపత్రిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో బంధు వులు యువకుడి మృతదేహాన్ని బైక్‌పై కట్టి తీసుకొచ్చారు. ఇది చూసిన ప్రజలు షాక్ తిన్నారు.గడ్చిరోలిలోని భామ్రాగడ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేనప్పుడు, ఒక యువకుడి మృతదేహాన్ని బైక్‌పై కట్టి ఆ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గణేష్ తెలమి అనే యువకుడు గత కొంతకాలం నుంచి క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. గడ్చిరోలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా తగినంత విశ్రాంతి తీసుకోలేదు. దీంతో కొద్దిరోజుల క్రితం పరిస్థితి విషమించడంతో గణేష్ ను కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ గణేష్ ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. రోజురోజుకూ ఆ యువకుడి పరిస్థితి మరింత దిగజారింది. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి గణేష్ మృతి చెందినట్లు సమాచారం. మృత దేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి ఆసుపత్రిలోని అంబులెన్స్ కోసం బంధువులు రాత్రంతా చూశారు. అయినప్పటికీ అంబులెన్స్ దొరకలేదు. మృతదేహాన్ని బైక్‌పై కట్టిమరీ తరలించాడు తమ్ముడు.


# ఆకాశంలో 'స్వర్గానికి ప్రవేశ ద్వారం'..
### అంతుచిక్కని మిస్టరీగా వింత ఆకారం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** మేఘావృతమైన ఆకాశంలో ఓ మిస్టీరియస్ ఆకారం కనిపించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఆకాశంలో ద్వారాలు (తలుపులు) మాదిరి ఉన్న ఆకారం ఒకటి వెలుగులు విరజిమ్ముతూ ఉన్నట్లు వీడియోలో చూడొచ్చు. బెంగళూరులోని హెబ్బాల్ ఫ్లైఓవర్ సమీపంలో శనివారం రాత్రి ఈ వింత కనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియో వసీమ్ అనే యూజర్ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. ప్రస్తుతం ఈ వీడియోను సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆకాశంలో భవనం, ఆ భవనానికి సంబంధించిన తలుపులు, తలుపుల వెనుక ప్రకాశవంతమైన వెలుగు కనిపించడం వెనుక ఉన్న సైన్స్ రహస్యం ఏమై ఉండవచ్చు? అని ప్రతిఒక్కరూ జుట్టులు పీక్కుంటున్నారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు కొందరు సరదాగా తీసుకుంటే.. మరికొందరేమో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇది మరో ప్రపంచానికి ప్రవేశ మార్గం అని, బెంగుళూరు వాతావరణంలో ఏలియన్స్ తమ బట్టలు ఆరబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ సరదాగా కామెంట్ సెక్షన్‌లో రాసుకొచ్చారు. ఒక వేళ అది ఏలియన్స్ పనే అయితే దయచేసి మా రోడ్లను బాగు చేసి వెల్లండి అని, కొత్తగా రీల్స్ ఏమైన ట్రై చేస్తున్నారా అంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.




# కన్నబిడ్డలకు కూడు పెట్టని కంత్రీ పేరెంట్స్..
### ఆకలితో భవనం పైనుంచి దూకిన 8 ఏళ్ల బాలిక


**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25 :** తల్లిదండ్రులు ఎవరైనా తమ కన్నబిడ్డలను అల్లారుముద్దుగా పెంచుకుంటారు. వాళ్లకు ఏ లోటు రానివ్వరు. తిండికి లేని నిరుపేదలైనా సరే వారు పస్తులు ఉండి పిల్లల కడుపు నింపుతారు. కానీ, అమెరికాలో నలుగురు పిల్లలను కన్న పేరెంట్స్ మాత్రం తమ బిడ్డలపట్ల అమానుషత్వాన్ని ప్రదర్శించారు. నెలల తరబడి పిల్లలకు సరిపడా ఆహారం పెట్టకుండా, ఇంటి నుంచి బయటికి రాకుండా నిర్భంధించారు. దాంతో ఓ 8 ఏళ్ల బాలిక ఆకలికి తట్టుకోలేక బిల్డింగ్ పై నుంచి కిందకు దూకింది. మిచాగాన్ రాష్ట్రంలోని కాల్‌హౌన్ కౌంటీలో ఇటీవల ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. కాల్‌హౌన్ కౌంటీకి చెందిన ర్యాన్ హార్డ్‌మాన్, ఎలియో దంపతులకు నలుగురు పిల్లలున్నారు. కానీ, వారు పిల్లలను తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎప్పుడూ డ్రగ్స్ మత్తులో ఉంటూ వారి సంరక్షణ బాధ్యతలు మరిచారు. ఆఖరికి పిల్లలకు తిండిపెట్టడం కూడా మానేశారు. దాంతో వాళ్లు మూడు రోజులకో, నాలుగు రోజులకో ఒకసారి పేరెంట్స్ తెచ్చుకుని తినగా మిగిలినవి తింటూ ఆకలితో అలమటించారు. ఈ క్రమంలో ఇటీవల ఆ పిల్లల్లోని ఓ 8 ఏళ్ల బాలిక ఆకలికి తట్టుకోలేక రెండో అంతస్తులోగల తమ ఇంటి కిటికీలోంచి కిందకు దూకింది. దూకినప్పుడు గాయాలు కాకుండా టెడ్డీబేర్‌ను పట్టుకుని దూకేసింది. ఆ తర్వాత ఆ వీధిలోని దుకాణ సముదాయాల దగ్గరికి వెళ్లి ఆకలి అంటూ అర్థించింది. వాళ్లు పాపకు భోజనం పెట్టి సమస్యఅడిగి తెలుసుకున్నారు. అనంతరం



పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ అమానుష పేరెంట్స్‌ను ఎంక్వయిరీ చేసేందుకు వెళ్లగా డ్రగ్స్ మత్తులో కనిపించారు. వారి పిల్లల్లో ఎనిమిదేళ్ల పాప ఎక్కడికెళ్లిందని అడిగితే పైన ఫ్లోర్లలో ఉన్న పిల్లలతో ఆడుకోవడానికి వెళ్లి ఉంటుందని అబద్ధం చెప్పారు. ఇంట్లో ఆహార పదార్థాలు ఉన్నా వండి పెట్టలేదని గుర్తించారు. అనంతరం ఆ ఇద్దరినీ అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఆ 8 ఏళ్ల చిన్నారితోపాటు ఆమె ముగ్గురు తోబుట్టువులను కూడా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

## ఆమె... ఆ పరమ శివుడినే పెండ్లి చేసుకుంది... ఫొటోలు వైరల్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** ఓ యువతి పరమ శివుడిని పెళ్లి చేసుకుంది. భగవంతుడిపై భక్తితో ఆయన్ను భర్తగా స్వీకరిచించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో ఈ విచిత్ర ఘటన చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఈ ఘటన చర్చనీయంగా మారింది.ఝాన్సీ జిల్లా అన్నపూర్ణ కాలనీకి చెందిన యువతి, ఆమె తల్లిదండ్రులు చాలా కాలంగా బ్రహ్మకుమారి ఆశ్రమంలో సభ్యులుగా



ఉంటున్నారు. శివుడిపై భక్తి పారవశ్యంతో ఆయన్నే పెళ్లి చేసుకుంటానని యువతి పట్టుబట్టింది.తన జీవితాన్ని పరమశివుడికి అంకితం చేయాలని సదరు యువతి నిశ్చయించుకుంది. చేసేదిలేక తల్లిదండ్రులు కూడా అందుకు అంగీకరించారు. తమ కుమార్తె వివాహాన్ని సంప్రదాయం ప్రకారం నిర్వహించాలనుకున్నారు ఆమె కుటుంబ సభ్యులు.నెల రోజులు ముందుగానే ఏర్పాట్లను ప్రారంభించారు. వివాహ ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధువులందరికీ ఆహ్వానం పలికారు. ఈ క్రమంలో ఆదివారం (జులై 23) సాయంత్రం 5 గంటలకు బడగావ్ గేట్ వెలుపల ఉన్న కళ్యాణ మండపంలో పరమశివుడితో ఆ యువతి పెళ్లి జరిపించారు.వధువు శివలింగానికి వరమాల సమర్పించి తన భర్తగా అంగీకరించింది. అనంతరం శివలింగాన్ని రథంపై ఊరేగించారు. వివాహానికి



## ఇస్రో చారిత్రాత్మక ప్రాజెక్ట్ 'గగన్‌యాన్'లో మరో కీలక అడుగు..
### ట్రయల్స్ సూపర్ సక్సెస్..

**ఇయ్యాల్టి న్యూస్, శ్రీహరి కోట, జూలై 25:**
ఇస్రో చారిత్రాత్మక ప్రాజెక్ట్.. గగన్‌యాన్.. గగన్ యాన్ సన్నాహాల్లో భాగంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ముందడుగు వేసింది. ఇస్రో, భారత నౌకాదళం గగన్‌యాన్ మిషన్ సన్నాహాల్లో భాగంగా రెండవ దశ రికవరీ ట్రయల్స్ ను విజయవంతంగా నిర్వహించాయి. విశాఖపట్నంలోని ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో జూలై 20 నుంచి మిషన్ గగన్‌యాన్ ప్రాజెక్టులో రికవరీ ట్రయల్స్ జరుగుతున్నాయి. గగన్‌యాన్ మిషన్ లో భాగంగా ముందుగా ముగ్గురు వ్యోమగాములను 400 కి.మీ కక్ష్యలోకి ప్రవేశపెడతారు. మూడు రోజుల తర్వాత వారిని సురక్షితంగా భూమికి తిరిగి తీసుకువస్తారు. ఈ మిషన్ గగన్‌యాన్ తద్వారా భారతదేశం మానవ అంతరిక్ష ప్రయాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా ఇస్రో పెట్టుకుంది. అంతరిక్ష పరిశోధనలో భారత్ ప్రతిష్టాత్మక లక్ష్యాల దిశగా ఈ మిషన్ చరిత్రలో నిలిచిపోనుంది.మొదటి దశలో అత్యవసర సమయంలో వ్యోమగాములను కాపాడే వ్యవస్థకు సంబంధించిన ఆల్టిట్యూడ్ ఎస్కేప్ మోటర్ పరీక్ష విజయవంతం అయిన విషయం తెలిసిందే. గగన్ యాన్ ప్రాజెక్ట్ లో భాగంగా దీనిని గతేడాది నిర్వహించారు. తాజాగా.. రెండవ దశ రికవరీ ట్రయల్స్‌లో మాస్ అండ్ షేప్ సిమ్యులేటెడ్ క్రూ మాడ్యూల్ మోకప్ నిర్వహించారు. ఇది టెస్టింగ్ ప్రక్రియలో ఒక కీలకమైన భాగం.. సీఎం ఆర్ ఎం వ్యోమగాముల దగ్గరకు సకాలంలో చేరుకోవడం, రికవరీ విధానాలు.. నిజ జీవిత పరిస్థితులను ఖచ్చితంగా అనుకరించేలా నిర్ధారిస్తుంది. తద్వారా మిషన్ విజయానికి విలువైన స్పష్టమైన డేటాను అందిస్తుంది.

# ఏడేళ్ళ కన్న కొడుకుని చంపేసి..
### సూసైడ్ చేసుకున్న పేరెంట్స్... కారణం తెలిస్తే షాక్ ..?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** మురళీధరన్ శైలజ దంపతులు.. ఈ అన్యోన్య దంపతులకు ఏకైక సంతానం జీవా.. జీవా వయస్సు ఏడేళ్లు.. కొడుకు భవిష్యత్తు కోసం ఎన్నో ఆలోచనలు పెట్టుకున్నారు.. ఐటి ఉద్యోగం చేస్తున్న మురళీధరన్ కుటుంభం ఆర్థికంగా కూడా బాగానే ఉంది. కన్యాకుమారిలోని ప్రైమ్ ఏరియాలో నూతన భవనం కూడా కట్టుకున్నారు మురళీధరన్ శైలజ.. మూడు నెలల క్రితమే గృహప్రవేశం కూడా జరిగింది. అంతా బాగానే ఉన్నా.. లోకం పోకడ కూడా తెలియని వయస్సులో ఉన్న కొడుకుని తల్లిదండ్రులే హత్య చేశారు.. రాత్రి పడుకునే ముందు నిద్రమాత్రలు పాలలో కలిపి తాగించారు.. ఆతర్వాత దిండుతో మొహంపై అదిమిపెట్టి ఊపిరి అడకుండా చేసి హత్యచేశారు. ఆతర్వాత అదే ఇంట్లో శైలజ, మురళీధరన్ దంపతులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చూడముచ్చటగా ఉన్న ఆ చిన్న పిల్లాడిని చంపడానికి బయటవారికే చేతులు రావు.. అలాంటిది తల్లిదండ్రులు వారి చేతులతో ఎలా చంపగలిగారు అంటూ విషయం తెలిసిన వారందరూ



బాధపడ్డారు. విషయం తెలిశాక పోలీసులు అక్కడకు చేరుకున్నారు.. విచారణ ప్రారంభించిన పోలీసులకు షాకింగ్ విషయం బయటపడింది.మురళీధరన్ కొడుకు జీవాకి అనారోగ్య సమస్య ఉందన్న విషయం బయటపడింది. మానసిక సమస్య ఉందని చెప్పారు. పరిష్కారం కోసం చాలామంది వైద్యులను కలిశారు తల్లిదండ్రులు.. వైద్యులు కొడుకు మానసిక పరిస్థితి జీవితాంతం ఇలాగే ఉంటుందని చెప్పడంతో తల్లితండ్రులు తీసుకున్న కఠిన నిర్ణయం.. తమ తర్వాత కొడుకు పరిస్థితిని ఊహించుకుని కొడుకును హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలింది.. కొత్తగా కట్టుకున్న ఆశల సౌధం.. ఎన్నో ఆశలు పెట్టుకున్న కొడుకు భవిష్యత్తు.. కొడుకుతో ఊహించుకున్న దంపతుల జీవితం.. అన్నీ ఒక్క నిర్ణయం తో ఇలా విషాదంగా మిగిలింది.

# పిట్ట పోయే.. 'ఎక్స్' వచ్చే...
### ఇక నుంచి వెబ్ డొమైన్..'ద ఎక్స్.కామ్'


**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 25:** ట్విట్టర్‌కు సరికొత్త రూపు తీసుకొస్తానన్న ఎలాన్ మస్క్ ట్విట్టర్ లోగో నుంచి పిట్టను తొలగించి 'ఎక్స్'ను ఆవిష్కరించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ట్విట్టర్ ప్రధాన కార్యాలయంపై కొత్త లోగో ఎక్స్‌ను ప్రదర్శించగా, ఈ ఫొటోను ఎలాన్ మస్క్ సోమవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ట్విట్టర్ డాట్‌కామ్.. ఇక నుంచి 'ద ఎక్స్.కామ్'గా రీడైరెక్ట్ చేస్తున్నట్టు మస్క్ ప్రకటించారు. నలుపు రంగు బ్యాక్‌గ్రౌండ్‌తో తెలుపు రంగులోని 'ఎక్స్' అనే గుర్తును మస్క్ ఎంచుకున్నారు. కంప్యూటర్లన్నింటిపైనా కొత్త లోగో కనిపించగా,



మొబైల్ యాప్‌లో పాత లోగో.. పిట్ట కొనసాగటం గమనార్హం. ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన తర్వాత, దీనిని సమూలంగా మార్చేస్తానని మస్క్ ప్రకటించారు. లోగో సహా అనేక మార్పులుంటాయని చెప్పారు. కొత్త లోగోపై ట్విట్టర్ సీఈవో లిండా యకరీనా స్పందిస్తూ, 'ఆడియో, వీడియో, మెస్సేజింగ్, బ్యాంకింగ్, చెల్లింపులకు భవిష్యత్తు వేదికగా నిలుస్తుంది. సరికొత్త ఆలోచనలకు, వస్తు సేవలకు, అవకాశాలకు గ్లోబల్ మార్కెట్‌ను సృష్టిస్తుంది' అని పోస్ట్ చేశారు. ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన తర్వాత ఎలాన్ మస్క్ నిర్ణయాలన్నీ బెడిసికొడుతున్నాయని విమర్శలున్నాయి. తాజా మార్పుకూడా అలాగే మారుతుందని ట్విట్టర్ యూజర్లు అభిప్రాయపడ్డారు. ఫేస్‌బుక్ తీసుకొచ్చిన కొత్త మెస్సేజింగ్ యాప్ 'థ్రెడ్స్' నుంచి ట్విట్టర్‌కు గట్టి పోటీ నెలకొంది.

# 'దేశ విచ్ఛిన్నం కోరే సంస్థల పేరులోనూ ఇండియా ఉంది'..
### విపక్ష కూటమిపై మోదీ ఫైర్

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 25:**
విపక్షాలు నూతనంగా ఏర్పాటు చేసుకున్న 'ఇండియా' కూటమిపై బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇండియన్ ముజాహిదీన్, ఈస్ట్? ఇండియన్? కంపెనీ పేరులో కూడా ఇండియా ఉందంటూ విరుచుకుపడ్డారు.



కూటమి పేరులో ఇండియా ఉండటం వల్ల ఏమీ మారదని అన్నారు. దేశ విచ్ఛిన్నం కోరే పీఎఫ్ఐ వంటి సంస్థల పేరులోనూ ఇండియా ఉందని గుర్తు చేశారు. సరైన దశాదిశాలేని విపక్షాన్ని ఇప్పటివరకు చూడలేదంటూ ఘాటైన విమర్శలు చేశారు. 26 పార్టీలు కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డ నేపథ్యంలో.. వారి లక్ష్యంగా పార్లమెంటరీ సమావేశంలో మోదీ విరుచుకుపడ్డారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

## ట్రెండీ లుక్స్‌లో
# హంసకి అక్కలా... జాన్వీ

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25:
అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టింది జాన్వీ కపూర్. దఢక్ చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. తర్వాత పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించింది ఈ భామ. ఎన్టీఆర్ సరసన దేవర సినిమాతో తెలుగులో అరంగేట్రం చేయనుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఈ వయ్యారి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలను చూసి ఫాన్స్ ఫిదా అవుతున్నారు.







## అందం ప్రేమలో పడితే.. ఇట్లనే ఉంటదేమో...
### గ్రీన్ డ్రెస్‌లో వావ్ అనిపిస్తున్న వర్ష..


ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25: జబర్దస్త్ లేడీ కమెడియన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది వర్ష. జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి షోలలో వర్ష తన గ్లామర్‌తో ఆకట్టుకుంటుంది. సీరియల్స్ తో తన కారియర్ ను స్టార్ట్ చేసింది ఈ భామ. తర్వాత జబర్దస్త్ షోతో బాగా పాపులర్ అయింది ఈ వయ్యారి. ఫోటో షూట్స్ చేయడంతో కాస్త డిఫరెంట్ వే లో వెళుతూ కుర్రాళ్లను ఫిదా చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## చూసి మూర్చాలె.....



## కళ్ళతోనే కుర్రాళ్ల గుండెలు దోచేస్తున్న...అనసూయ..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25: బుల్లితెర అందాల యాంకర్ గా అనసూయ అందరికి సుపరిచితం. టీవీ షోలలోనే కాదు స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో నటించి మెప్పిస్తుంది ఈ భామ. రంగస్థలంలో రంగమ్మ అత్తగా అనసూయ నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. పుష్ప మూవీలో నెగిటివ్ రోల్ లో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం పుష్ప 2 చిత్రంలో నటిస్తుంది ఈ అమ్మడు. ఇటీవల విమానం మూవీలో సుమతి అనే పాత్రలో ఆకట్టుకుంది.



## పొట్టి డ్రెస్సులో పిచ్చెక్కిస్తున్న... వేదిక..
## చిన్నదాని ఫిజిక్ చూస్తే అందరూ ఫిదా...

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25: ముద్దుగుమ్మ వేదిక గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు అవసరం లేదు..

లారెన్స్ హీరోగా నటించిన ముని సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయం అయింది బ్యూటీ..తరువాత అనేక తెలుగు సినిమాల్లో నటించిన మంచి విజయాలను ఇవ్వలేదు..

## పవర్ స్టార్ బ్రో మూవీ సెన్సార్ పూర్తి..
# టాక్ ఎలా ఉందంటే..?

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే అభిమానులకు పండగే.. రాజకీయాలతో బిజీగా ఉన్న పవర్ స్టార్ గ్యాప్ దొరికిన ప్రతిసారి సినిమా షూటింగ్స్ చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే వకీల్ సాబ్, భీమ్లానాయక్ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న పవన్ కళ్యాణ్.. ఇప్పుడు బ్రో మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.

ఈ సినిమాలో మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కూడా నటిస్తున్నాడు. సముద్ర ఖని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. తమిళ్ లో ఘనా విజయం సాధించిన వినోదయ సిత్తం సినిమాకు రీమేక్ గా తెరకెక్కుతున్నప్పటికీ ఈ సినిమా కథలో చాలా మార్పులు చేర్పులు చేశారట త్రివిక్రమ్. ఒరిజినల్ లా ఉండదు అని సముద్రఖని గట్టిగానే చెప్తున్నారు.

జులై 28న బ్రో మూవీని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచింది చిత్రయూనిట్.తాజాగా ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చింది. బ్రో మూవీకి క్లిన్ యూ సర్టిఫికెట్ జారీ చేసింది సెన్సార్ బోర్డ్. అలాగే ఈ సినిమా పై పాజిటివ్ రివ్యూ ఇస్తున్నారు సెన్సార్ సభ్యులు.


ఈ సినిమాలో పవర్ స్టార్ ఎలి వేషన్స్.. ఆయన నుంచి అభిమానులు కోరుకునే స్టఫ్ ఉందని తెలుస్తోంది.



అలాగే ఈ సినిమా రన్ టైమ్ 2 గంట 14 నిమిషాలు ఉందట. బ్రో సినిమా సూపర్ హిట్ అవ్వడం ఖాయం అంటున్న ఫ్యాన్స్. ఇటీవలే సాయి ధరమ్ తేజ్ విరూపాక్ష సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇప్పుడు బ్రో మూవీతో ఆకట్టుకోవడానికి రెడీ అవుతున్నాడు. అలాగే జులై 25న ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా నిర్వహించనున్నారు.

## ప్రభాస్ 'కల్కి' రిలీజ్
# డేట్ వాయిదా?
## ఆ సెంటిమెంట్ కారణంగానే ..!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25:** ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 A.D. రూపొందుతోంది. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై 600 కోట్ల రూపాయల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలావరకూ చిత్రీకరణను జరుపుకుంది. ప్రభాస్ సరసన దీపిక పదుకొణె నటిస్తున్న ఈ సినిమాలో, అమితాబ్ .. కమల్ కీలకమైన పాత్రలను పోషిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 12వ తేదీన విడుదల చేయనున్నట్టు చెప్పారు. అయితే ఇప్పుడు ఆ తేదీన ఈ సినిమా థియేటర్లకు రాకపోవచ్చునే ఒక టాక్ బలంగా వినిపిస్తోంది. మరో నాలుగు నెలల ఆలస్యంగా, అంటే మే నెలలో ఈ సినిమాను విడుదల చేయనున్నారని అంటున్నారు. మే 9వ తేదీని ఖరారు చేసే ఆలోచనలో ఉన్నారని చెబుతున్నారు. అయితే ఇలా రిలీజ్ డేట్ ను వాయిదా వేయడానికి గల కారణం, ముందుగా అనుకున్న సమయానికి పనులు కాకపోవడం కారణం కాదు .. వైజయంతీ వారికి ఉన్న



సెంటిమెంట్ కారణమనే టాక్ వినిపిస్తోంది. గతంలో ఈ బ్యానర్లో మే 9వ తేదీన విడుదలైన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' .. 'మహానటి' సినిమాలు ఘన విజయాలను అందుకున్నాయి. అదే సెంటిమెంట్‌తో ఇప్పుడు 'కల్కి'ని అక్కడికి జరుపుకుతున్నారనేది ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్.

## హీరోని పెళ్లాడిన యంగ్ హీరోయిన్..
# నెట్టింట ఫొటోలు వైరల్


**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25:** యంగ్ హీరోయిన్ నూరిన్ షరీఫ్, ప్రియుడు ఫహీమ్ సఫర్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సహ నటుడైన ఫహీమ్ సఫర్‌ను నటి నూరిన్ ప్రేమించి పెళ్లి చేసుకుంది. తిరువనంతపురంలో సోమవారం వీరి నిఖా జరిగింది.గతేడాది డిసెంబర్‌లో నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట ఎట్టకేలకు పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఈ బ్యూటీ స్వయంగా తన ఇన్‌స్టాలో షేర్ చేసింది.ప్రస్తుతం వీరి ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నటి ప్రియా ప్రకాశ్ వారియర్ 'లవర్స్ డే' (మలయాళంలో 'ఒరు అదార్ లవ్') అనే సినిమాతో నూరిన్ షరీఫ్



తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ మూవీలో మెయిన్ హీరోయిన్ నూరిన్ షరీఫ్ అయిన ప్పటికీ ఈమెకు పెద్దగా క్రేజ్ రాలేదు.దీంతో మల యాళంలోనే నటిగా స్థిరపడిపోయింది. డ్యాన్సర్‌గా కెరీర్ మొదలు పెట్టిన నూరిన్ షరీఫ్ 'చంక్జ్' మువీతో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత ఒరు అదార్ లవ్, శాంతా క్రూజ్, వెళ్లప్పం, బర్ముడా, ఆన్ ద అదర్ హ్యాండ్ వంటి సినిమాల్లో నటించింది. ఓ సినిమాకు పనిచేస్తున్న క్రమంలో యాక్టర్ కమ్ రైటర్ అయిన ఫహీమ్ సఫర్, నూరిన్ షరీప్ పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కొన్నాళ్లకు ఫ్రెండ్స్ అవ్వడం ప్రేమలో పడటం, నిశ్చితార్థం, పెళ్లి అంతా చకచకా జరిగిపోయింది.

## క్రేజీ ఆఫర్‌ను అందుకున్న పూజాహెగ్డే..
# ఆ స్టార్ హీరో సినిమాలో ఛాన్స్..?

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25:** సినిమా ఇండస్ట్రీలో రాణించాలంటే అందం అభినయంతో పాటు అదృష్టం కూడా ఉండాలి . స్టార్ హీరోయిన్ గా హీరోయిన్స్ చాలా మంది ఇలా వచ్చి అలా వెళ్లిన వారే.. ఓవర్ నైట్ లో స్టార్ డమ్ తెచ్చుకున్న ముద్దుగుమ్మలు చాలా మంది కొన్ని సినిమాలు చేసిన తర్వాత కనుమరుగైన సంగతి తెలిసిందే. కొంతమందికి స్టార్ డమ్ ఉన్నప్పటికీ సినిమాలు మాత్రం వరుసగా ఫ్లాప్ అవుతూ ఉంటాయి. అలాంటి వారిలో పూజాహెగ్డే ఒకరు. ప్రస్తుతం టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా రాణిస్తుంది పూజాహెగ్డే. కానీ ఈ అమ్మడు చేసిన సినిమాలన్నీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతున్నాయి. ఈ మధ్య కాలంలో పూజ నటించిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తాకొట్టాయి. దాంతో ఈ అమ్మడిని ఐరెన్ లెగ్ అని కూడా ట్రోల్ చేశారు. ఇక ఇప్పుడు పూజ వచ్చిన సినిమాలనుంచి కూడా తప్పుకుంటుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు నటిస్తున్న గుంటూరు కారం సినిమాలో ముందుగా పూజ హెగ్డే ను మెయిన్ హీరోయిన్ గా ఎంపిక చేశారు. కానీ ఊహించని విధంగా ఈ సినిమానుంచి పూజ హెగ్డే తప్పుకుంది. ఆమె ప్లేస్ లో శ్రీలీలను మెయిన్ హీరోయిన్ గా ఎంపిక చేశారు. అలాగే సెకండ్ హీరోయిన్ గా మీనాక్షి చౌదరి నటిస్తుంది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ లోనూ ముందుగా పూజాహెగ్డే హీరోయిన్ అంటూ వార్తలు వచ్చాయి.ఆ తర్వాత ఆమె ప్లేస్ లోకి శ్రీలీలను హీరోయిన్ గా తీసుకున్నారు. అయితే ఈ రెండు సినిమాలనుంచి పూజా ఎందుకు తప్పుకుందో తెలియదు. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ అమ్మడు మాస్ రాజా రవితేజ సరసన సినిమా చేస్తుందని టాక్. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రవితేజ నాలుగో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే.. ఈ సినిమాలో హీరోయిన్ గా పూజాహెగ్డేను హీరోయిన్‌గా అనుకుంటున్నారట. త్వరలోనే దీని పై క్లారిటీ రానుంది.





## గుర్తుపట్టలేనంతగా అరియానా..
# ట్రోల్ చేస్తున్న నెటిజన్స్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 25: అరియానా గ్లోరీ.. బిగ్ బస్ గేమ్ షో ద్వారా పాపులారిటీ సొంతం చేసుకుంది అరియనా. బోల్డ్ బ్యూటీగా బిగ్ బాస్ హూస్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ. ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంది. అందంతో బిగ్ బాస్ చూసే ప్రేక్షకులోను బాగానే ఆకర్షించింది. ఆతర్వాత బిబి జోడీతో కూడా మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. అలాగే పలు టీవీ షోల్లో కూడా ఆ తర్వాత ఈ చిన్నది ఎక్కువగా కనిపించలేదు. సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. రోజు గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఉంటుంది. ఇదిలా ఉంటే తాజాగా అరియాను ట్రోల్ చేస్తున్నారు నెటిజన్స్. ఆమె ఫోటోలకు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకు అరియానను ఎందుకు ట్రోల్ చేస్తున్నారంటే.. అరియానా కు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ఇన్ స్టా గ్రామ్ లో ఈ అమ్మడికి 1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఈ అమ్మడు పోస్ట్ చేసే ఫోటోలు చూస్తే మతిపోతుంది. కుర్రకారుకుకిర్రెక్కించే ఫోజులతో అదరగొడుతోంది అరియానా. తాజాగా ఈ వయ్యారి పోస్ట్ చేసిన పిక్స్ వైరల్ గా మారాయి.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838